## క్లుప్తంగా

### రేపు చెకుముకి పోటీ పరీక్ష

తొర్రూరు/నెల్లికుదురు/డోర్నకల్/కురవి/కేసముద్రం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రేపు (శనివారం) మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా, మండల నాయకులు గురువారం తెలిపారు. ఆయా మండలాల్లోని పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతుల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున ఈ పరీక్షలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు సైతం ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

### 'అనాథలు ప్రభుత్వ అతిథులు'

మహబూబాబాద్ : తల్లిదండ్రులు లేరని ఎవరూ బెంగ పడొద్దని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని అతిథులుగా చూసుకుంటూ బాగోగులను సంరక్షిస్తుందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ అశోక్ అన్నారు. గురువారం జాతీయ బాలికా వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల సదనంలో బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది సుగుణ, మనీషా, కళ్యాణి, రమ పాల్గొన్నారు.

### ఫ్రీజర్ అందజేత



నెల్లికుదురు : మండలంలోని కాచికల్ గ్రామానికి మాజీ సర్పంచ్ గంజి విజయపాల్‌రెడ్డి-వసంతల కుమారుడు సందీప్‌రెడ్డి జ్ఞాపకార్థం తొర్రూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఫ్రీజర్‌ను గ్రామపంచాయతీకి అందజేశారు. సర్పంచ్ గుగులోత్ శ్రీను, ఉప సర్పంచ్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనరసింహరావు, డాక్టర్ శారద, వెంకటేశ్వర్లు, రమేష్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దుచేయాలి



మహబూబాబాద్ అర్బన్ : జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పలు కళాశాలల్లో జాతీయ విద్యా విధానం రద్దు, సేవ్ ఇండియా, సేవ్ ఎడ్యుకేషన్ డిమాండ్లతో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు దూరం చేసే కుట్ర అమలు చేస్తుందన్నారు. నాయకులు సంజయ్, రాహుల్, నాగరాజు, వికాస్, సాయికుమార్, నాగేష్, లావణ్య, వెన్నల, స్వప్న పాల్గొన్నారు.

### పలువురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని బీసీ కాలనీ ప్రాంతంలో నాలుగు ఇళ్లు కూల్చి వేశారు. ఈ సంఘటనలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని టౌన్ ఎస్సై డి.పవన్ కుమార్ గురువారం తెలిపారు. బీసీ కాలనీ ప్రాంతంలో తిప్పిరిశెట్టి ప్రసాద్ అనే వ్యక్తి 2014లో కర్నావత్ వెంకన్న వద్ద స్థలం కొనుగోలు చేసి అందులో ఒక గదిని నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం శనిగపురం మాజీ సర్పంచ్ గుగులోత్ రాజు, మరికొంతమంది వచ్చి పొక్లెయినర్‌తో ప్రసాద్ గదితో పాటుగా మరో ముగ్గురికి చెందిన ఇళ్లను కూల్చి వేశారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### దొంగ అరెస్ట్

డోర్నకల్ : ఆటోను దొంగిలించిన ఖమ్మంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన దివ్యాంగుడు షేక్ నవాబ్ మున్వర్‌ను అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ విలేకరులతో మాట్లాడారు. ఆటోతో సహా నవాబ్ మున్వర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### గడ్డివాములు దగ్ధం



గార్ల : ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన రాంపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన సిరమర్తి పెద్దశ్రీనుకు చెందిన 4 ఎకరాల గడ్డివాము, సిరిమర్తి చిన్నశ్రీనుకు చెందిన మూడెకరాల గడ్డివామి పక్కపక్కనే పెట్టుకున్నారు. ఈ గడ్డివాముల మీది నుంచి విద్యుత్ లైన్ వెళ్తోందని, వాటి రాపిడితో నిప్పురవ్వలు గడ్డివాములపై పడటంతో మంటలు అంటుకుని కాలిపోయిందని బాధిత రైతులు పేర్కొన్నారు. ఫైరింజన్ ఆలస్యంగా రావడంతోనే గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయని గ్రామస్తులు ఆరోపించారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు, పరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు సందర్శించారు.

---



తొర్రూరు: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



బయ్యారం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



గార్ల: ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ స్వాతిబిందు



నెల్లికుదురు: సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

# ఓటు ప్రజాస్వామ్య జీవనాడి

ఓటు ప్రజాస్వామ్య జీవనాడి అని పలువురు అధికారులు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా విద్యార్థులు, స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కురవి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



మరిపెడ: ఓటరు అవగాహన ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ, కమిషనర్, తహసీల్దార్ తదితరులు



గూడూరు: ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ అశోక్ కుమార్, విద్యార్థులు



మరిపెడ రూరల్: తానంచర్లలో..



నర్సింహులపేట: ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్



దంతాలపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది



డోర్నకల్: మాట్లాడుతున్న తహసీల్దార్ నాగభవాని



దంతాలపల్లి: ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్



మహబూబాబాద్ రూరల్: ఇస్లావత్ తండాలో..



గార్ల: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న రాజు

## ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..

● మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ : పట్టణంలోని మిషన్ భగీరథలో మరమ్మతులు, అవాంతరాలు ఏర్పడినప్పుడు నీటి సరఫరా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మున్నేరు వాగు శివారులోని ఫిల్టర్ బెడ్‌ను గురువారం చైర్మన్, అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఫిల్టర్ బెడ్ ద్వారా కూడా నీరు అందించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, కమిషనర్ టి.ప్రసన్నరాణి, డీఈ సిహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్దన్, వెన్నం లక్ష్మారెడ్డి, బి.అజయ్‌సారథి, సూర్నపు సోమయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

## కరపత్రాల ఆవిష్కరణ



మహబూబాబాద్ అర్బన్ : పదోతరగతి విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రతిభ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్యదర్శి కే.సాయికుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం నాయకులు ఆవిష్కరించారు. గుగులోత్ సూర్య ప్రకాష్, బానోత్ సింహాద్రి, పట్టణ నాయకులు రాజేష్, వినయ్, ప్రణయ్, నిఖిల్, చింటు, సన్ని పాల్గొన్నారు.

## 'నిధులపై సమాధానం చెప్పాలి'

మహబూబాబాద్: మాజీ సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి ప్రకటించిన రూ.50 కోట్ల నిధుల జీఓపై మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ సమాధానం చెప్పాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మానుకోట మున్సిపాలిటీకి కేటాయించిన రూ.50 కోట్ల నిధులపై చైర్మన్ మౌనంగా ఉంటున్నారని.. ఆంతర్యమేంటో అర్థం కావడం లేదన్నారు. నిధులు విడుదల అయిన్నట్లుగానే కౌన్సిలర్ల ప్రమేయం లేకుండానే వార్డులకు కేటాయించారన్నారు. ఇప్పటికైనా చైర్మన్ స్పందించి నిధులపై మాట్లాడి వార్డులకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెరుగుకుమార్, నవీన్, సాంబలక్ష్మి, రవి, శ్రావణ్, వీరన్న, చిరంజీవి, జ్ఞానేశ్వర్, నాగార్జున, రమేష్, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్

నెహ్రూసెంటర్ : హమాలీ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించాయని ఆరోపించారు. కార్మిక చట్టాల రద్దు, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్, వ్యక్తిగత ఇన్సూరెన్స్, ఆరోగ్యబీమా, ఈఎఫ్, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికవర్గ సమస్యల పరిష్కారం కోసం జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆల్ హమాలీ యూనియన్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అంబటి వీరస్వామిని ఎన్నుకున్నట్లు ఉపేందర్ తెలిపారు. సమావేశంలో కుమ్మరికుంట్ల నాగన్న, బత్తుల వెంకన్న, సముద్రాల వెంకన్న, రవి, లక్ష్మణ్, ప్రవీణ్, సత్యం, మల్లయ్య పాల్గొన్నారు.

## 'ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి'

మహబూబాబాద్ అర్బన్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట గడ్డపై కాషాయం జెండా ఎగురవేయాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పార్లమెంట్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ధర్మారావు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏడు శాతం నుంచి 14శాతం వరకు బీజేపీ ఓటు స్థాయి పెరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి మహిళా, యువజన, ప్రజా, మేధావుల సంఘాలను, స్వచ్ఛంద సంస్థలను, విద్యావంతులను కలిసి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పట్టభద్రుల, ఎంపీ ఎన్నికలపై వివరించాలన్నారు. ఇప్పటికే రెండు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఉక్కు పాదంతో ప్రధాని మోదీ ఏరి పారేశారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ స్థాయిలో విస్తృతంగా పనిచేసి మానుకోట పార్లమెంటులో విజయం సాధించాలన్నారు. సమావేశంలో వెంకట్ నారాయణ, జాటోత్ హుస్సేన్ నాయక్, వద్దిరాజు రామచందర్ రావు, నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యాప సీతయ్య, కె.వి రానా, బలరాం, పద్మారావు, సతీష్, దేవేందర్, భూక్య సంగీత, శ్యామ్ సుందర్ శర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

## టీజేఎస్ నాయకుల సంబురాలు

మహబూబాబాద్ అర్బన్ : గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరామ్ ఎమ్మెల్సీగా ఎన్నికై నందున మానుకోట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వివేకానంద సెంటర్లో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు, నాయకులు బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇది తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవమని, అనేకమంది ఉద్యమకారుల పోరాటాల సమష్టి ఫలితమన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, టీపీఏజేఏసీ రాష్ట్ర నాయకుడు మైస శ్రీనివాస్, ఆరుద్ర పరమాత్మ చారి, ఖాజాపాషా, ఇరుగు మనోజ్ కుమార్, చుంచు శ్రీశైలం, మామిడాల సత్యనారాయణ, బుర్ర గోవర్ధన్, ఆర్టీసీ జేఏసీ లక్ష్మణ్, పమ్మి రాజు, పొక్కుల సదానందం, వీరారెడ్డి, కృష్ణప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవీరావడం ఉద్యమానికి దక్కిన గౌరవమని తెలంగాణ ఉద్యమకారుడు శంతన్ రామరాజు హర్షం వ్యక్తంచేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం శంతన్ రామరాజు మాట్లాడుతూ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ రావడం ఉద్యమకారులపట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు అడుగడుగునా అవమానాలు చీదరింపులు, ఛీత్కారాలే మిగిలాయని ఆవేదన వ్యక్తంచేశారు. గత పదేళ్ల కాలంలో ఉద్యమ ద్రోహులు పదవులు అనుభవిస్తుంటే తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని బాధను వ్యక్తపరిచారు. మార్పుకోసం యావత్ తెలంగాణ పౌర సమాజం పదేళ్ల నిరంకుశత్వానికి, అవినీతికి చమరగీతం పాడి కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న ఉద్యమకారులను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతో ఉద్యమకారులు ఆత్మగౌరవంతో ముందుకెళ్తున్నారన్నారు. తెలంగాణ ప్రజల్లో ఉద్యమ కాంక్షను రగిల్చిన కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవీ ఇవ్వడం సముచిత నిర్ణయమన్నారు.



బాణసంచా కాల్చుతున్న టీజేఎస్ నాయకులు

## సంక్షిప్త సమాచారం

### కార్మిక సదస్సును జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: కార్మికుల హక్కుల సాధనకోసం ఫిబ్రవరి 2 తేదీన జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరగనున్న కార్మిక సదస్సును జయప్రదం చేయాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు.

### నియామకం

కేసముద్రం : తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన వేల్పుగొండ ఏలియాను నియమించినట్లు ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి గురువారం తెలిపారు.

### హైదరాబాద్‌కు తరలిన నాయకులు

గంగారం : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశానికి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు బయలుదేరి వెళ్లారు.

### దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని సంబంధిత కన్వీనర్ బొడ్ల రామకృష్ణ గురువారం తెలిపారు. స్థానిక పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరుగనున్న వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలి

కురవి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో పీహెచ్‌సీని పరిశీలించారు.

### బీమా చెక్కు అందజేత

మరిపెడ రూరల్ : ప్రతి కుటుంబం బీమా పాలసీ చెల్లించి ధీమాగా ఉండాలని వరంగల్ డివిజన్ తపాలా శాఖ పర్యవేక్షకుడు ఎస్.వీ.ఎల్.ఎన్ రావు అన్నారు. మరిపెడ మండలంలోని మూలమఠ్రితండా గ్రామ పంచాయతీకి చెందిన వాంకుడోత్ రాజమ్మ ఇటీవల మృతిచెందింది. కాగా నామిని అయిన ఆమె కుమారుడు వాంకుడోత్ వీరన్నకు బీమా పాలసీ కింద రూ.10 లక్షల చెక్కును తపాలా శాఖ అధికారులు గురువారం అందజేశారు.

### వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు

కేసముద్రం /కురవి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల ముఖ్య సలహాదారుడిగా నియమితులైన వేం నరేందర్‌రెడ్డిని, మండలంలోని కల్వల సర్పంచ్ గంట సంజీవరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, రాంచంద్రు నాయక్, ఉన్నారు. అలాగే టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ మాలోత్ నెహ్రూనాయక్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు.

### అభినందన

పెద్దవంగర : మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హేమంత్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడు. కాగా గురువారం నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు, గైడ్ టీచర్‌ను, విద్యార్థిని అభినందించారు.

### పరామర్శ

మరిపెడ రూరల్ : వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆయనను గురువారం కలిసి పరామర్శించారు.అలాగే చిల్లంచర్ల గ్రామానికి చెందిన పగిండ్ల వెంకన్న (50) గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

### కోతుల బీభత్సం

కేసముద్రం : మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన రైతు షేకిడి సతీష్ మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. కాగా గురువారం మొక్కజొన్న పంటలో కోతులు బీభత్సం సృష్టించి పంట నాశనం చేశాయి. ఇప్పటికే ఫీట్ వరకు మొక్కలు పెరగగా, వానరాల గుంపు మొక్కలన్నింటిని కొరికి పడేశాయి. కోతుల బీభత్సంతో ఎకరం పంట నష్టపోయానని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

### ఆర్ట్, క్రాఫ్ట్, సంగీతం టీచర్లను నియమించాలి

మహబూబాబాద్ అర్బన్ : మెగా డీఎస్సీలో ఆర్ట్, క్రాఫ్ట్, సంగీతం ఉపాధ్యాయులను నియమించాలని బీఈడీ నిరుద్యోగులు మట్టే సురేష్, భూక్య వినోద్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిరుద్యోగులు మాట్లాడారు. టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి సుమారు 2 లక్షల పైగా మంది ఈ నియామకాలకోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ప్రకటనలో భాగంగా ఆర్ట్, క్రాఫ్ట్, సంగీతం పోస్టులను కూడా మంజూరు చేసి అవకాశం కల్పించాలన్నారు. నిరుద్యోగులు బానోత్ చిట్టిబాబు, మాలోత్ కిషోర్ నాయక్, శరణ్య, సౌందర్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి

కేసముద్రం : నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ గురువారం ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారంగా సీఎంఆర్ కింద ప్రభుత్వానికి బియ్యం అందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న, కేసముద్రం మండలంలోని పలు మిల్లుల యాజమాన్యాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

బయ్యారం : తెలంగాణ యాదవ మహాసభ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బయ్యారంలో గురువారం ఎస్సై ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోతుల దిలీప్‌యాదవ్, మండల అధ్యక్షులు గుగ్గిళ్ల వెంకన్న, యూత్ అధ్యక్షుడు జక్కుల సునీల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కేజీకేఎస్ క్యాలెండర్..

కేసముద్రం : మండలంలోని కల్వలలో కేజీకేఎస్ 2024 క్యాలెండర్‌ను గురువారం సంఘం నాయకులు ఆవిష్కరించారు.

### దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీ



దంతాలపల్లి : మండలంలోని పెద్దముప్పారం, రామవరం, ఆగాపేట, వేములపల్లి, రేఖ్యతండా, తూర్పుతండా డీఎన్టీసీఎస్‌లో గ్రేస్ సొసైటీ ఖమ్మం వారి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### క్రీడా దుస్తులు..

చిన్నగూడూరు : మండలంలోని విస్సంపల్లికి చెందిన ఎన్ఆర్ఐ ఎం.వెంకటరమణ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. కాగా ఎన్ఆర్ఐ వెంకటరమణకు హెచ్ఎం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అక్రమంగా ఇసుక తరలింపు

తొర్రూరు రూరల్ : మండల పరిధిలోని ఆకేరు, పాలేరు వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను జోరుగా తరలిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. ప్రధానంగా జమస్థాపురం, గుర్తూరు, కంఠాయపాలెం, మడిపల్లి, సోమారపు కుంట, కస్నా తండాల శివారులో ఉండే ఆకేరు వాగు, బొమ్మకల్, కర్కాల, చిట్యాల, అరిపిరాల గ్రామాల శివారులో ఉండే పాలేరు వాగుల నుంచి రాత్రి వేళల్లో యజమానులు ట్రాక్టర్లల్లో లోడ్ చేసుకోవడంతోపాటు ఇసుక డంపులను ఏర్పాటు చేసుకొని తొర్రూరుతోపాటు ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రైవేట్ కట్టడాలకు ఇసుకను తరలిస్తున్నారు. మండలంలోని వాగుల నుంచి విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్న సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుల సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు ఎండిపోతుండడంతో రైతులకు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.